# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

**DECEMBER - 2003**

## సత్యవాణి - టి.వి. స్పందన

"క్రీస్తు నందు శుభములు! మీరు పంపించిన పుస్తకములు నా ఆధ్యాత్మిక జీవితమునకు ఎంతో ఆశీర్వాదకరముగా నున్నవి. నా ఆత్మకు తృప్తిని కలిగించే ప్రసంగాలును, నా సేవా పరిచర్యకు సహాయపడే పుస్తకముగాను ఉన్నది. మీరు టి.వి.లో యిస్తున్న ప్రసంగాలు చక్కగాను, సత్యవాక్యమును సరిగాను విభజించు చున్నారు. లోకంలో మతశాఖలు ఈ బోధకు దూరంగా వున్నారు. మీరు పంపిన బైబిలు కూడ నా కందింది. మీరు చేస్తున్న సేవ అనేకులకు ఆశీర్వదకరంగా ఉందని మీ నిమిత్తము నేను సాక్ష్యమిచ్చు చున్నాను. నా సాక్ష్యమే కాదు, దేవుడు కూడ, God bless you"

*- ఎ. జాన్‌రాజ్, కొండపల్లి, కృష్ణాజిల్లా.*

సత్యవాణి వారికి వందనములు; 15-11-03 తేదీన యేసు క్రీస్తు ఎవరు? అన్న విషయం మీద మాకు చక్కగా వివరించిన బ్రదర్ జాన్ రిక్కీ గూటం గార్కి వందనములు. ప్రభువు ఆ బిడ్డను బలముగా వాడుకొనునుగాక! రిఫరెన్సుల ద్వారా జాన్ రిక్కీ గారు వివరిస్తుంటే శ్రద్ధగా ఆలకించాము. యేసు క్రీస్తును గూర్చి ఇంకా ఎక్కువ తెలిసికోగలిగాము. ఆంధ్ర ప్రజలకు దేవుని వాక్యమును అందించుటకై యేసు క్రీస్తు ప్రభువు వారు ఇచ్చిన గొప్ప బహుమానము జాన్ రిక్కీ, God bless you.

*- పి. జయకుమార్, మంగళగిరి, గుంటూరు జిల్లా.*

దైవజనులు జాషువా గార్కి హృదయ పూర్వక వందనములతో వ్రాయున దేమనగా అయ్యా, నేను హిందు కుటుంబములో నుండి వచ్చినాను. మేము విగ్రహారాధికులము. నేను యేసు ప్రభువు దగ్గరకు వచ్చినాను. మా ఇంటిలో నున్న విగ్రహములన్నియు తీసివేసినాము. మా కొరకు మీ సంఘస్థులందరు ప్రార్థించమనవి".

*- యమ్. వేణుగోపాలరావ్, ప్రకాశంజిల్లా.*

అయ్యా, మీ అబ్బాయి రిక్కీగారి ప్రసంగం చాలబాగుంది. మీ ట్రయినింగ్ బాగుంది. తండ్రిని మించిన కుమారుడు; చిన్నవాడైనను గొప్ప ప్రసంగీకుడైనందుకు దేవునికి వందనములు.

*- సిహెచ్. జాన్‌బాబు, ముంగండ, తూ॥గో॥జిల్లా.*

Dear Bro. Joshua, Greetings in the most precious name of our Lord and saviour Jesus Christ. Thanks be to God that whole family is being utilised by God. We are viewing programmes on Saturdays. Ricky & Robin are coming up thanks to God. And there

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 24 — డిశంబర్ 2003 — సంచిక 5


## యూదుల యుగము

(The Jewish Age)

బైబిలులోని మొదటి యుగమగు గోత్రకర్తల యుగము అంతమునకు వచ్చు సరికి అబ్రాహాము యొక్క మనుమడైన యాకోబు ఒక రాత్రంతయు ఒక దేవుని దూతతో పెనుగులాడెను. "నీవు దేవుని తోను, మనుష్యులతోను, పోరాడి గెలిచితివి గనుక ఇకమీదట నీపేరు ఇశ్రాయేలే గాని యాకోబు అనబడదని" చెప్పి ఆ దేవుని దూత యాకోబు పేరును ఇశ్రాయేలుగా మార్చెను (ఆది 32:28). ఈ సంఘటన జరుగక కొన్ని వందల సంవత్సరములకు ముందు యెహోవా దేవుడు, అబ్రాహాముతో "నీవు లేచి నీ దేశమునుండియు, నీ బంధువుల యొద్ద నుండియు, నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును. నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించిన వారిని శపించెదను; భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడు" నని వాగ్దానము చేసెను (ఆది 12:1-3).

అబ్రాహాము సంతతియైన ఇశ్రాయేలీయులు కొన్నివందల సంవత్సరములు గడచుసరికి ఒక గొప్ప జనాంగమాయెను. ఐగుప్తు బానిసత్వమునుండి వారు విడుదల పొందుసరికి నిజముగా వేరొక గొప్ప జనముగా (Nation) చేయబడిరి. "ఇశ్రాయేలీయులు బహు సంతానము గలవారై అభివృద్ధి పొంది విస్తరించి అత్యధికముగా ప్రబలిరి. వారున్న ప్రదేశము వారితో నిండియుండెను" (నిర్గ 1:7). ఐగుప్తీయులు ఇశ్రాయేలీయులను అనగా యూదులను ద్వేషించివారిని బానిసలుగా చేసిరి (నిర్గ 1:8-14). అయితే ఆ యూదులలో నుండే దేవుడు వారికొక గొప్ప నాయకుని, అనగా మోషేను అనుగ్రహించెను. ఫరోరాజుతో అనేక విధములుగా వ్యాజ్యమాడిన తరువాత మోషే ఇశ్రాయేలీయులను దాసత్వము నుండి విడిపించి సీను అరణ్యములోనికి వారిని నడిపించెను (నిర్గ 14). ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమునుండి బయలుదేరిన మూడవనెలలో, వారు బయలుదేరిననాడే మూడవ నెల ఆరంభ దినమందే, వారు సీనాయి అరణ్యమునకు వచ్చిరి (నిర్గ 19:1). అక్కడ ఆ పర్వతము యెదుట ఇశ్రాయేలీయులు విడసిరి (19:2). మోషేతో మాటలాడుటకు దేవుడు మోషేను ఆ పర్వతము పైకి పిలచెను. దేవుడు మోషేతో "కాగా మీరు నామాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడచినయెడల మీరు సమస్త దేశజనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు సమస్త భూమియు నాదేగదా. మీరు నాకు యాజకరూపమైన రాజ్యముగాను, పరిశుద్ధమైన జనముగాను ఉందురని చెప్పుము; నీవు ఇశ్రాయేలీయులతో పలుక వలసిన మాటలు ఇవే" అని చెప్పెను (నిర్గ 19:6, 7).

ఇశ్రాయేలీయులను తన కొరకు స్వకీయ జనముగా నిర్ణయించు కొనినందున దేవుడు వారికి సీనాయి కొండ మీద ఒక ప్రత్యేక ధర్మశాస్త్రమును మోషే ద్వారా అనుగ్రహించెను (నిర్గమ 20). ఈ ధర్మశాస్త్రమును ఇశ్రాయేలీయుల పితరు ఎరుగరు (ద్వితీ 5:3). పది ఆజ్ఞలతో కలసియున్న ఈ ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే అనగా దాసుల గృహమైన ఐగుప్తు దేశము నుండి వెలుపలికి వచ్చినవారికే ఈయబడెను (నిర్గ 20:2). దానియందు ఇశ్రాయేలీయులు మాత్రమే బద్ధులై యుండిరి. సీనాయి కొండమీద ఈయబడిన ఈ ధర్మశాస్త్రము యేసుక్రీస్తు సిలువపై బలిగా అర్పింపబడు వరకు అమలులో యుండెను. గనుక ఇంచుమించు 1600 సంవత్సరములు పాటు దేవుడు ఇశ్రాయేలీయులను ఒక జనాంగ

ముగా అనగా ఒక జాతిగా (Nation) పరిగణించి వారికి తన చిత్తమును బయలు పరచెను. ధర్మశాస్త్రము నిచ్చుట ద్వారా ఆ జనాంగము నంతటిని దేవుడు చట్ట బద్ధులుగా చేసెను.

దేవుడు ఇశ్రాయేలీయులు కిచ్చిన ధర్మశాస్త్రమును మనము సాధారణముగ పాత నిబంధనయనియు, యెహోవా ధర్మశాస్త్రమనియు, మోషే ధర్మశాస్త్ర మనియు, పిలుచు చుందుము. అది యూదులకే ఈయబడినందున అన్యజను లకును, యూదులకును మధ్య ఒక గోడవలె తయారయ్యెను (ఎఫె 2:14). యూదుల కొక ధర్మశాస్త్రముండెను గాని అన్యజనుల కది లేకపోయెను. ఈ పరిస్థితి మోషేతో ఆరంభమై క్రీస్తుతో కూడ పెంతెకోస్తు దినము వరకు కొనసాగెను. సీనాయి కొండపై దేవుడు పది ఆజ్ఞలనేగాక అనేక న్యాయవిధులను, కట్టడలను ఇశ్రాయేలీయుల కొరకు నియమించెను. ఇశ్రాయేలీయులు వారి స్వంతదేశమైన కానానుకు ప్రయాణము చేయుచుండగా వారి కొక ఆరాధన మందిరమును, అనగా ప్రత్యక్షగుడారమును మోషేతో దేవుడు వారికి నిర్మించెను. ఆ మందిరములో సేవ చేయుటకు లేవీయులను యాజకులుగా దేవుడు నియమించెను (సంఖ్యా 1:50).

ప్రత్యక్ష గుడారమునందు రెండు గదు లుండెను. మొదటిది పరిశుద్ధ స్థలమనియు, రెండవది అతి పరిశుద్ధ స్థలమనియు పిలువ బడెను. పరిశుద్ధ స్థలమందు సాంబ్రాణి పొగల నర్పించుబల్లయు, దీపవృక్ష ప్రకాండ మును, సముఖపు రొట్టెల బల్లయు ఉండెను. యాజకులు ఈ మొదటిగదిలో నుండి దిన దినము సేవ చేసెడివారు. అతి పరిశుద్ధ స్థలములో సువర్ణ ధూపార్తియు, నిబంధన మందసమును ఉండెను, సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే ప్రధాన యాజకుడు ఒక్కడే రక్తము చేతపట్టుకొని అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించి ఆ రక్తము తన కొరకును, ప్రజల అజ్ఞానకృతము కొరకును అతడర్పించు చుండెను (హెబ్రీ 9:1-7). ప్రత్యక్ష గుడారమునకు ముందుగా దహన బలిపీఠ ముండెను. దానిపై దిన దినము పాప ప్రాయ శ్చిత్తార్థ బలులను ఇశ్రాయేలీయులు అర్పించెడివారు. రక్తబలులు, దహనబలులు మొదలగునవి కేవలము యూదులకు మాత్రమే వర్తించెను.

మోషే తరువాత దేవుడు ఇశ్రాయేలీయులకు యెహోషువాను నాయకునిగా అనుగ్రహించెను. అతని నాయకత్వమందు ఇశ్రాయేలీయులు కానాను చేరుకొనగల్గిరి (సంఖ్యా 26:63-65). యెహోషువా చనిపోయి తరువాత ఇశ్రాయేలీయులను

రక్షించు నిమిత్తము 300 సంవత్సరాలపాటు దేవుడు న్యాయాధి పతులను ఏర్పరచెను (న్యాయా 2:16-19). అటు తరువాత ఇశ్రాయేలును పరిపాలించుటకు దేవుడు రాజుల నేర్పాటు చేసెను. సౌలు, దావీదు, సొలొమోను రాజులు పరిపాలించిన 120 సంవత్సరములలోను ఇశ్రాయేలు యొక్క పేరు ప్రఖ్యాతులు భూదిగంతముల వరకు వ్యాపించెను. గాని సొలొమోను కుమారుడైన రెహబాము ఏలుబడిలో ఇశ్రాయేలు రెండు రాజ్యములుగా విడిపోయెను. యరొబాము అనునతడు విగ్రహారాధనను ఇశ్రాయేలు ప్రజలలో మరల ప్రవేశపెట్టెను. దేవుడు ఏర్పరచుకొనిన జనాంగము ఆయన మార్గము నుండి ఇట్లు తొలగిపోగా వారు తమ స్వదేశములో నుండి అష్షూరు దేశములోనికి చెరకొని పోబడిరి (2 రాజులు 17:7-23). అయినను దేవుడు వారిని ప్రేమించి వారి మధ్యకు ప్రవక్తలను పంపించెను. కొంతకాలము గడచిన తరువాత ఇశ్రాయేలు మారుమనస్సును వ్యక్తపరపగా దేవుడు వారిని తమ స్వదేశమునకు తిరిగి పంపెను.

చివరిగా దేవుడు తన స్వంత కుమారుని వారి మధ్యకు పంపెను. ఆయన ద్వారా యూదులనే కాదుగాని, ఈలోకము నందున్న జనములన్నిటిని తన స్వకీయ జనముగా చేసికొనగల్గునట్లు దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను. యేసుక్రీస్తు ముందుగా యూదుల యొద్దకు వచ్చెను. గాని వారు ఆయన నంగీకరింప లేదు (యోహా 1:11). యేసుక్రీస్తు యూదునివలె జన్మించెను. మోషే ధర్మశాస్త్రము అమలులోనున్నప్పుడు ఆయన జన్మించెను. అందువలన ఆయన ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను. "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీ యందు పుట్టి, మనము దత్తపుత్రులు కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడి యున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను" (గలతీ 4:4).

యేసుక్రీస్తు కంటె ముందు యోహాను వచ్చి "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడని" యూదులకు ప్రకటింప మొదలిడెను (మత్త 3:1). దేవుని రాజ్యము సమీపమై యున్నది, మారుమనస్సు పొందుడి యని యేసు క్రీస్తు కూడ బోధింప సాగెను. దానిద్వారా ఒక క్రొత్త యుగము సమీపించి యున్నదని బాప్తిస్మమిచ్చు యోహాను, యేసుక్రీస్తు కూడ బోధింపసాగిరి. ధర్మశాస్త్రము, యూదుల యుగము గతించిపోవుటకు సిద్ధముగా నున్నవని యేసుక్రీస్తు బోధించెను.

"ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల వచనముల నైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును, భూమియు గతించి పోయిననేగాని ధర్మశాస్త్ర మంతయు నెరవేరు వరకు దానినుండి యొక పొల్లయినను, ఒక సున్నయినను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని" యేసు బోధించెను (మత్త 5:17, 18).

అయితే ద్వేషముచే యూదుల మతగురువులు యేసుక్రీస్తును సిలువ వేసి చంపిరి. సిలువపై ఆయన చనిపోవక ముందు సమస్తమును సమాప్తమాయెనని చెప్పెను. క్రీస్తు సిలువపై మరణించుట ద్వారా పాత నిబంధనను ఆయన నెరవేర్చెను. అంతటితో యూదుల యుగము అంతమాయెను. యూదుల యుగములో ఆరాధన అంతయు ఒకే ఒక్క జనాంగమునకు చెందెను. యేసు క్రీస్తు పునరుత్థానుడగుటలో క్రైస్తవయుగ మారంభమాయెను. అప్పటినుండి సర్వలోకములో యున్న సర్వసృష్టియు దేవుని కృపకు పాత్రులగు అవకాశము లభించెను. అంతర్జాతీయమగు క్రైస్తవ యుగమును గూర్చి వచ్చే సంచికలో నేర్చుకొందము.

ఉపమానమాలిక :

## ధనవంతుడు గాని వెర్రివాడు

*(Rich but Foolish)*

"మీరు ఏవిధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్త పడుడి; ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదని" యేసుప్రభువు బోధించారు. మరియు లూకా 12:16–21లో ఆయన ఈ ఉపమానము చెప్పారు :

"ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను. అప్పుడతడు-నాపంట సమకూర్చుకొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతునని తనలో తానాలోచించుకొని-నేనీలాగు చేతును; నా కొట్లు విప్పి, వాటికంటె గొప్పవాటిని కట్టించి అందులో నా ధాన్యమంతటిని, నా ఆస్తిని సమకూర్చుకొని, నా ప్రాణముతో-ప్రాణమా, అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడి యున్నది; సుఖించుము,

తినుము, త్రాగుము, సంతోషించుమని చెప్పుకొందుననుకొనెను, అయితే దేవుడు, వెర్రివాడా, యీరాత్రి నీప్రాణము నడుగుచున్నారు; నీవు సిద్ధపరచినవి ఎవనివగునని అతనితో చెప్పెను. దేవుని యెడల ధనవంతుడు కాక తన కొరకే సమకూర్చుకొనువాడు అలాగుననే యుండునని" యేసు ప్రభువు బోధించారు.

యేసు ప్రభువు అనేక అంశములను గూర్చి బోధించుచుండగా జనసమూహములో ఒకడు లేచి, పిత్రార్జితములో నాకు పాలు పంచిపెట్ట వలెనని నా సహోదరునితో చెప్పుమని ఆయన నడిగాడు. అందుకాయన ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదని, గనుక మీరు లోభులుగా యుండకుడని చెప్పి ఈ ఉపమానాన్ని బోధించారు.

ఆస్తిని సంపాదించుకోవాలనే ఆశ అందరికి ఉంటాది. ఆస్తి హక్కును సద్వినియోగం చేయుటవలన నాగరికత, సాహిత్యము, భక్తి మార్గము మొదలగునవి ప్రబలుతాయి. వీటిని గూర్చిన ఆశ లోభత్వము కానేరదు. మరల ధనము కలిగి యుండుట కూడ లోభత్వము కానేరదు. కొందరు లోభులు, గాని ధనహీనులు. అయితే కేవలం ధనాన్నే కలిగియుండడానికి, దానినే జీవిత ధ్యేయంగా చేసుకొని యుంటే అది లోభం అవుతాది. ధనార్జనచేసి దాని పోగు పెట్టడానికి మాత్రమే జీవించుచున్న యెడల అది లోభం అవుతాది. అట్టిది ఒకని జీవమునకు మూలము కాదు.

అయితే ఒకని జీవమునకు మూలమైనది యేది? సరియైన గుణ లక్షణములు, ఆత్మీయ ఐశ్వర్యము, తన యెడల గాక దేవుని యెడల ధనవంతులై యుండుట ఒకని జీవమునకు మూలమై యున్నది. డబ్బు లేకుండగనే మనం సంతోషాన్ని పొందగలము, ప్రయోజన కారులుగ యుండగలం. యెహోవా దేవుని మాట ఈలాగున్నది: "దప్పిగొనిన వారలారా, నీళ్ల యొద్దకు రండి. రూకలు లేనివారలారా మీరువచ్చి భోజనము చేయుడి.......ఆహారము కానిదాని కొరకు మీరేల రూకలిచ్చెదరు? సంతుష్టి కలుగజేయని దానికొరకు మీకష్టార్జితమును ఎందుకు వ్యయపరచెదరు? నా మాట జాగ్రత్తగా ఆలకించి మంచి పదార్థము భుజించుడి" (యెషయా 55:1, 2). ఈలోకంలో ధనవంతులనేకులున్నారు గాని వారు దేవుని దృష్టిలో దరిద్రులే. ఈ గొప్ప సత్యం యేసు ప్రభువు చెప్పిన ఉపమానంలో మనకు మరింత విపులంగా కనబడుచున్నది.

ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా

పండినది. అతడు అసలే ధనవంతుడు, అందులోను తన పొలం సమృద్ధియైన పంటనిచ్చింది. గాని ఈ సందర్భంలో అతడు దేవుని పూర్తిగా మరచిపోయాడు. మనం ఏమి సంపాదించుకొన్నా, ఎందులో నైనా విజయాన్ని సాధించినా, మన పొలములు బాగా పండినా అది దేవుని కృపను బట్టియే. మన ఆరోగ్యము, బలము, జ్ఞానము దేవునినుండే కలుగు చున్నది. ఆలాగే మంచి పంట కవుసరమైన గాలి, వర్షము, సూర్యరశ్మి మొదలగు వాటిని దేవుడు ఉచితంగానే యిచ్చు చున్నాడు. అయితే ఈ ధనవంతుడు వీటన్నిటిలోను దేవుని పాత్ర యేమీ లేనట్టు, అంతా తనవలనే అయినట్లు ఆలోచించుకొనుచున్నాడు. అతని ఆలోచ నలు ఇట్లున్నాయి: నా పంటను సమ కూర్చు కొనుటకు నాకు స్థలము చాలదు, గనుక నేనేమి చేతును? నేనీలాగు చేతును: నా కొట్లు విప్పిస్తాను. వాటికంటె గొప్ప వాటిని కట్టిస్తాను. నా ధాన్యమంతటిని నా ఆస్థిని సమకూర్చుకొంటాను. అనేక సంవత్సరములవరకు తింటాను, త్రాగు తాను, సుఖిస్తాను. అతని ఆలోచనలన్నీ 'నేను' 'నా' అనే పదములతోనే నిండి పోయాయి. తనకు కలిగినదంతయు తనవలన తనకొరకే కలిగిందను కొన్నాడు, తన ఆలోచనలలో పాలుగువాడెవడులేడు. ఏమైనా సంకల్పిస్తే, అంతా తనకొరకే సంకల్పించాడు. అనేక సంవత్సరముల కొరకు విస్తారమైన ఆస్థి సమకూర్చు కొన్నాను గనుక తింటాను, త్రాగుతాను, సుఖిస్తాను అని యనుకొన్నాడు. దేవునికిగాను, పరులకు గాని అతని తలంపులలో యేమీ స్థానం లేకపోయింది.

ఈ ధనవంతుడు బహుగా ఆశీర్వదిం పబడ్డాడు, గాని యితరులకు అతడు ఆశీర్వాదకరముగా యుండడానికి నిరాకరిం చాడు. ఆపదలలో ఆదుకొనవలసిన వారనే కులున్నారు. అన్న వస్త్రములు లేక, నిలువ నీడ లేక బాధపడుచున్న బీదలనేకులున్నారు. నిజానికి అతడు కొట్లునిండగా మిగిలిన వాటిని ఇట్టి వారిపై వినియోగించి తాను శాశ్వతమైన ధనం సంపాదించుకొనే తరుణం కలిగి యున్నాడు (మార్కు 10:21). గాని దానిని అతడు ఆలోచించనేలేదు. పక్షిరాజు ఆకాశమునకు ఎగిరి పోవునట్లు ఐశ్వర్యము ఎగిరిపోవునను సంగతి అతడు మరచి పోయాడు (సామె 23:5). ఈ లోక సంగ తులే తన ప్రాణమునకు, లేక ఆత్మకు శ్రేష్టమని తలంచాడు. దేవుని మాట వలన గాక, భౌతిక ఆహారము వలన చిరకాలము జీవిస్తానని అను కొన్నాడు (మత్త 4:4).

అయితే దేవుడు అదే రాత్రి అతని ప్రాణము నడిగారు. తన ధన ధాన్యములు, విస్తారమైన ఆస్థి మరణాన్ని ఆపుచేయ లేకపోయాయి. అతడు గొప్ప లంచమిచ్చి ఈ మరణదూతను మళ్లించలేకపోయాడు. నా ప్రాణమా అనేక సంవత్సరముల కొరకు విస్తారముగా నేను సంపాదించా నను కొన్నాడు. దేవుడతనిని, వెర్రివాడాయని పిలిచారు. తన ప్రాణం తనదికాదు దేవుని వని చెప్పారు. యీరాత్రి నీ ప్రాణము నడుగు చున్నారు, నీవు సిద్ధపరచినవి ఎవని వగునని దేవుడు అడిగారు.

అవి యెవరివి? అవి ఎల్లప్పుడు ఎవరివో ఆయనవే. సమస్తము దేవునివే (1 దినవృ 29:14). భూమియు దాని సంపూర్ణతయు యెహోవావే. మానవులు వచ్చి, పోతారు గాని దేవుడు అమర్త్యుడు (1 తిమో 6:18). నిత్యుడు.

నీవు దేవుని యెడల ధనవంతుడవా? నీవు సత్యము జీవించాలని కోరుచున్నావా? అయితే యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. పరలోకంలో ధనం కూర్చు కొనుటకు ఈనాటి నుండే ఆరంభిచుము.

- జాషువా గూటం

క్రీస్తు సంఘములు సమర్పించు 'సత్యవాణి' టి.వి.
కార్యక్రమమును ప్రతి శనివారం ఉదయం 6:30 నుండి 7:00
వరకు తేజ ఛానల్‌లో చూడండి.
మీ బంధుమిత్రులతో కలిసి సువార్తను వినండి.

# అబ్రాహాము, మెల్కీసెదెకు

*(Abraham & Melchizedek)*

పాత నిబంధనలో మెల్కీసెదెకును గూర్చిన సమాచారము పెద్దంతగా లేక పోయినను, పురావస్తు శాస్త్రము ద్వారా బైబిలు విద్యార్థి మేలు పొందగలడు. ఇప్పటి వరకు చిక్కుముడిగా యున్న కొన్ని బైబిలు లేఖన భాగములను గ్రహించుకొనుటకు పురావస్తు శాస్త్రము (archaelogy) సహాయ పడుచున్నది. ఈ శాస్త్రము ద్వారా బైబిలు యదార్థమైన చరిత్రయని అనేక మారులు రుజువైనది.

అబ్రాహాము హెబ్రోనులో నివసించు చుండగా తన బంధువైన లోతు సొదొమ వైపు యోర్దాను ప్రాంతమంతటిని తన కొరకు ఏర్పరచుకొనెను. మెసపొతొమియా ప్రాంతపు రాజులు ఆ ప్రదేశమును దండెత్తి సొదొమ గొమొర్రాల నుండి అనేకులను చెరగొనిరి. వారిలో లోతు ఒకడు. అబ్రహాము ఆ సంగతి వినినప్పుడు 318తో కలసి దానుమట్టుకు ఆ రాజులను తరి మెను. వారు కొల్లగొనిన ఆస్తిని, స్త్రీలను లోతును ప్రజలను తిరిగి తీసికొని వచ్చెను (ఆది.కా. 14:1-16).

ఆ తూర్పుదేశపు రాజులను సంహా రము చేసి తిరిగి వచ్చుచుండగా షాలేము రాజైన మెల్కీసెదెకు అబ్రహామును కలసి కొనెను. అతడు రాజు మాత్రమే గాక, సర్వో న్నతుడగు దేవునికి యాజకుడని కూడ చెప్పబడెను (ఆది.కా. 14:18-19). అతడు అబ్రాహామును ఆశీర్వదించెను. అప్పుడు అబ్రాహాము అన్నిటిలోను పదియవ వంతు అతనికి ఇచ్చెను. మెల్కీసెదెకు మన రాజును ప్రధాన యాజకుడైన క్రీస్తును పోలిన వాడని క్రొత్త నిబంధన బోధించు చున్నది. (హెబ్రీ 7:15). "అతడు తండ్రిలేనివాడును తల్లిలేని వాడును వంశ వళిలేని వాడును, జీవిత కాలమునకు ఆదియైనను జీవమునకు అంతమైనను లేనివాడునై యుండి దేవుని కుమారుని పోలియున్నాడని" చెప్పబడినది (హెబ్రీ 7:3). ఇదొక ఆశ్చర్యకరమైన వర్ణన.

ఈ అలంకార భాషను బట్టి వివిధ ములైన వివరణము లిచ్చుటకు ప్రజలు పూనుకొనిరి. ఆరిజన్ అను పురాతన గ్రంథ కర్త (క్రీ॥ శ॥ 185-253) మెల్కీసెదెకును ఒక దేవదూత యని తలంచాడు. 3వ శతాబ్దపు అంతములో హాయిరేకస్ అను నతడు మెల్కీసెదెకు అనునతడు పరిశు ద్ధాత్మ యొక్క తాత్కాలిక అవతారమని తలంచాడు. మరికొంత మందయితే అతడు

వాక్యరూపమున నున్న యేసుక్రీస్తే యని తలంచేవారు (యోహాను 1:1; 14). గాని ఆ భావాన్ని హెబ్రీ 7:3లో పరిశుద్ధాత్ముడే ఖండించారు. ఆ రాజు "దేవుని కుమారుని పోలియున్నాడని" మాత్రమే యని అక్కడ చెప్పబడింది.

"అతడు తండ్రి లేనివాడును తల్లిలేని వాడును" అను మాటలపై పురావస్తు శాస్త్రము కొంత వెలుగును ప్రకాశింప జేసింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటిలో అష్షూరు దేశ చరిత్రలో ప్రొఫెసర్‌గా పని చేసిన ఎ.హెచ్. సేస్ అను నతడు క్రీ॥ శ॥ 1887లో ఈజిప్టులో లభించిన రాతి పలకల మీద యున్న వ్రాతను పరిశీలించాడు. అవి ప్రఖ్యాతి గాంచిన Tell el - Amarna రాతిపలకలు. ఈ రాతి పలకలు క్రీ॥ పూ॥ 1400-1360 సంవత్సరముల కాలములో సరియా దేశములోను, పాలస్తీనలోను యున్న పరిస్థితులను వివరించుచున్నవి.

Tell el - Amarna (తెల్ ఏల్ అమర్నా) రాతి పలకలు నిజానికి ఉరూ సలీమ్ (యెరూషలేము) రాజుఫరో రాజుకు వ్రాసి పంపిన వర్తమానములై యున్నవి. తన శత్రువులను జయించడానికి సహాయాన్ని కోరుతూ అతడా లేఖలను పంపించాడు. తాను పాలస్తీనాలో యున్న మిగతా పాలకుల వంటివాడు కాదనియు, అతని కిరీటమును తన తండ్రి నుండి గాని, తల్లి నుండి గాని పొందలేదు గాని నేరుగా సర్వశక్తుడైన దేవుని నుండే పొంది తిననియు అతడు వాటిలో వ్రాసెను (Sayce 1906, 3:335).

దీనిని బట్టి మెల్కీసెదెకు యొక్క రాజకరికము, యాజకత్వము అతనికి వంశ పారంపర్యముగా రాలేదని మనం గ్రహించు కొనగలము. సరిగదా అతని పదవిని నేరుగా అతడు దేవుని నుండి యే పొందెను. నిజానికి అతడు "సర్వోన్నతుడైన దేవునిచే" నియ మింప బడినవాడు (ఆది.కా. 14:18). అని లేఖనములు ఉద్భోధించు చున్నవి. అదే రీతిగా మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క రాజరికము, ప్రధాన యాజకత్వము కూడ సర్వోన్నతుని దేవుని సంకల్పమువలన నైనట్టిది. మెల్కీసెదెకు యొక్క సందర్భాన్ని మనం గ్రహించుకొను నట్లు ఈ రీతిగా పురాతత్వ శాస్త్రము మనకు సహాయ పడి నందుకు కృతజ్ఞులము.

✍ - వేయిన్ జేక్సన్ (R & R)

# యెఫ్తాతన కుమార్తెను బలి యిచ్చెనా ?

*(Did Jephtha Sacrifice his Daughter ?)*

ఇశ్రాయేలీయుల న్యాయాధిపతియైన గిలాదీయుడైన యెఫ్తా అమ్మోనీయుల మీదికి యుద్ధమునకు పోగెను. "అప్పుడు యెఫ్తా యెహోవాకు మ్రొుక్కుకొనెను. ఎట్లనగా - నీవు నా చేతికి అమ్మోనీయులను అప్పగించిన యెడల, నేను అమ్మోనీయుల నుండి క్షేమముగా తిరిగి వచ్చునప్పుడు నన్ను ఎదుర్కొనుటకు నా యింటి ద్వారము నుండి బయలు దేరి వచ్చునదేదో అది యెహోవాకు ప్రతిష్టిత మగును. (లేదా) మరియు దహన బలిగా దాని నర్పించెదననెను" (న్యాయా 11:30-31). అయితే యెఫ్తా మిస్పాలోనున్న తన యింటికి వచ్చినప్పుడు అతని కుమార్తె తంబురలతోను నాట్యముతోను బయలు దేరి అతనిని ఎదుర్కొనెను. "ఆమెగాక అతనికి మగ సంతానమేగాని ఆడు సంతానమే గాని లేదు" (న్యాయా 11:34). ఆమె రెండు నెలల మట్టుకు తన కన్యాత్వమును గూర్చి ప్రలాపించి వచ్చెదనని తన తండ్రి యొద్ద సెలవు తీసి కొనిపోయెను. " ఆ రెండు నెలల అంతమున ఆమె తన తండ్రి యొద్దకు రాగా అతడు తాను మ్రొుక్కుకొనిన మ్రొుక్కుబడి చొప్పున ఆమెకు చేసెను. ఆమె పురుషుని ఎరుగనేలేదు. ప్రతి సంవత్సరమున ఇశ్రాయేలీయుల కుమార్తెలు నాలుగు దినములు గిలాదు దేశస్థుడైన యెఫ్తా కుమార్తెను ప్రసిద్ధి చేయుట కద్దు" (న్యాయా 11:39-40).

అయితే యెఫ్తా యెహోవాకు మ్రొుక్కుకొనినట్లు తన కుమార్తెను బలి యిచ్చెనా? దీని విషయమై బైబిలు యేమి చెప్పుచున్నది?

యెఫ్తా తన కుమార్తెతో "నేను యెహోవాకు మాట యిచ్చి యున్నాను గనుక వెనుదీయ లేననగా, ఆమె నా తండ్రీ యెహోవాకు మాట యిచ్చి యుంటివా? నీ నోటి నుండి బయలు దేరిన మాట చొప్పున నాకు చేయుము..... మరియు ఆమె నా కొరకు చేయవలసిన దేమనగా రెండు నెలల వరకు నన్ను విడువుము; నేనును నా చెలికత్తెలును పోయి కొండల మీద ఉండి నా కన్యాత్వ మును గూర్చి ప్రలాపించెదననగా, అతడు పొమ్మని చెప్పి రెండు నెలలవరకు ఆమెను పోనిచ్చెను. గనుక ఆమె తన చెలికత్తెల తోపోయి కొండల మీద తన కన్యాత్వమును గూర్చి ప్రలాపించెను". రెండు నెలల తరువాత ఆమె తిరి రాగా తాను మ్రొుక్కుకొనిన

మ్రొక్కుబడి చొప్పున అతడు ఆమెకు చేసెను. ఆమె పురుషుని ఎరుగనేలేదు (న్యాయా 11:35-40).

ఏవిధముగా చూచినా యెఫ్తా తన కుమార్తెను బలి యిచ్చెనని ఈ లేఖన భాగంలో మనకు కనబడదు. యెఫ్తా కుమార్తె తన చెలికత్తెలతో కలిసి తన కన్యాత్వమును గూర్చి ప్రలాపించెనే గాని తన మరణమును గూర్చి కాదను వాస్తవాన్ని మనం గమనించాలి. గనుక ఆమె చంపబడ లేదని రుజువగుచున్నది (Lange's Commentary).

ఇశ్రాయేలీయుల కుమార్తెలతో కలిసి తన కన్యాత్వమును గూర్చి ప్రలాపించుటకే ఆమె రెండు నెలలు గడువు అడిగింది. దీనిని బట్టి ఆమె అన్యాయంగా యెహోవా దేవునికి బలి ఇయ్యబడి నట్లగుపడదు. ఆమె తన జీవితకాలమంతయు కన్యగానే యుండునట్లు ప్రతిష్టితము చేయబడెను. ఒక స్త్రీ జీవితాంతము వరకు కన్యగానే కాలము గడుపుట ఇశ్రాయేలులో గొప్ప విపత్తు, గొప్ప త్యాగము (a great calamity and sacrifice). ఆమె ఇశ్రాయేలు దేశపు జీవిత చరిత్రలో తన జనాంగములో తన కుటుంబ సంతతిని సజీవముగా యుంచలేనిదాయెనని దీని యర్థము. తత్ఫలితముగా యెఫ్తా యొక్క సంతతి సంపూర్తిగా అంతమయ్యింది. ఏలయనగా "ఆమె గాక అతనికి మగ సంతానమే గాని ఆడు సంతానమే గాని లేదు" (11:34). ప్రత్యక్ష గుడారపు సేవార్థమై ఆమె జీవితాంతము సేవకు రాలివలె ప్రతిష్టింప బడవలసి యుండెను. అట్లు ప్రతిష్టితము చేయబడిన సేవకులు, సేవకురాండ్రు యున్నట్లు సంఖ్యా కాండము 31:35-40 వరకు చదివిన గ్రాహ్యమగును. దేవాలయ సేవార్థమై ప్రతిష్టితము చేయబడిన తరువాత, ఆమె (అట్టివారు) బయటికి వెళ్లుటకు వీలుపడదు. అందువలననే తన కన్యాత్వము గూర్చి తన చెలి కత్తెలతో ప్రలాపించుటకు ఆమె రెండు నెలలు గడువు అడిగింది. (Dake's Annotated Reference Bible). ఇంకో మాటలో, "నేనెన్నడు పెండ్లాడను గనుక నా చెలికత్తెలతో యుండు టకు రెండు నెలలు సెలవిమ్ము" అని ఆమె అడిగి ఉందనుట సమంజసము (11:37).

యెఫ్తా కుమార్తె తన జీవిత కాల మంతయు కన్యగానే యుండి తన జీవితాన్ని త్యాగం చేసిందనడానికి బలమైన ఆధారాలున్నాయి. ఏలయనగా "అతడు తాను మ్రొక్కు కొనిన మ్రొక్కుబడి చొప్పు ఆమెకు చేసెను. ఆమె పురుషుని ఎరుగనే లేదు" అని వ్రాయడి యున్నది (11:39). ఈ రెండు

మాటలు చాల ప్రాముఖ్యమైనవి. ఆమె దేవునికి సమర్పించబడెను మరియు ఆమె పురుషుని ఎరుగనే లేదు! ఇంకోమాటలో యెహోవాకు చెల్లవలసిన ప్రతిష్టితార్పణ ముగా యెఫ్తా ఆమెను ప్రతిష్టించెను, తత్ఫలితముగా ఆమె ఎన్నడు పెండ్లాడక కన్యగానే జీవించెను.

ఇంకా, “ప్రతి సంవత్సరము ఇశ్రాయే లీయులు కుమార్తెలు నాలుగు దినములు గిలాదు దేశస్థుడైన యెఫ్తా కుమార్తెను ప్రసిద్ధి (Praise) చేయుట కద్దు” అని వ్రాయబడి యున్నది గాని ప్రలాపించు టకు కాదు. King James Version ఇంగ్లీషు బైబిలులో, “ఇశ్రాయేలు కుమార్తెలు ప్రతి సంవత్సరము ఆమెతో మాట్లాడుకు వెళ్లుచుండిరి” యని Foot note లో వ్రాయబడి యున్నది. ఆమె యొక్క సాహస నిర్ణయాన్ని కొనియాడుచు వారు ప్రతి సంవత్సరము ఆమె యొద్దకు వెళ్లేవారు. యెఫ్తా గనుక ఆమెను బలి యిచ్చి యుంటే ప్రతి సంవత్సరం వారా మెతో ఎట్లు మాట్లాడతారు ?

“నరహత్య చేయవద్దు” అని ఆజ్ఞా పించిన యెహోవా దేవుడు నరబలిని కోరడు, దాన్ని బట్టి సంతోషించడు. సరి గదా ఆయన మాట చొప్పున చేయక తమ కుమారులను కుమార్తెలను అగ్నిలో దహిం చుటకు బలి పీఠములను కట్టుకొనిన యూదా వారిని ఖండిస్తు “నేనాజ్ఞాపించని క్రియను, నాకు తోచని క్రియను వారు చేసి యున్నా రని” ఆయన చెప్పెను (యిర్మీయా 7:31). నరబలిని బట్టి దేవుడు సంతోషించు వాడైతే అబ్రాహాము చేత తన కుమారుడైన ఇస్సాకును వధింపజేసి యుండేవాడే; తరువాత అతన్ని మరల బ్రతికించి యుండే వాడే. అదే ఒక గొప్ప అద్భుత మయ్యుండేది. గాని దేవుడట్లు దాన్ని జరుగనియ్యలేదు. ఏల యనగా నరబలిని నరహత్యను ఆయన అసహ్యించుకొంటాడు.

ప్రతి తొలుచూలు పిల్లను, పశువులలో తొలిచూలు పిల్లను దేవునికి ప్రతిష్టింపబడ వలెనని ఆయన ఆజ్ఞాపించినను (నిర్గమ 13:12, 13), పశువులు మాత్రమే వధింపబడెను గాని తొలిచూలు కుమారులు, కుమార్తెలు విడిపింపబడిరి (నిర్గమ 34:20). దేవుని యొక్క ఈ నియమమును యెఫ్తా బాగుగా ఎరిగిన వాడై యుండి, “అమ్మోనీ యుల నుండి క్షేమముగా తిరిగి వచ్చు నప్పుడు నన్ను ఎదుర్కొనుటకు నా యింటి ద్వారము నుండి బయలు దేరి వచ్చునదేదో అది యెహోవాకు ప్రతిష్టిత మగుననెను”. బయలు దేరి వచ్చున దెవరో యని అతడ నలేదు. దీనిని బట్టి నరబలిని యెఫ్తా కూడ

ఎన్నడు తలంచనేలేదు. ఏదైనా కుక్క గాని, గాడిద గాని, పంది గాని అతనికి ఎదురు వచ్చిన యెడల దాన్ని కూడ అతడు బలి అర్పించి యుండేవాడు కాదు "ఏలయనగా ఈ జంతువుల బలిని దేవుని ఆజ్ఞ నిషేధించింది. అట్లే నరబలి కూడాను!!

(Vop)

# మానవుడే పాటివాడు ?

*(What is Man?)*

"నీ చేతిపనియైన ఆకాశములను, నీవు కలుగజేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడే పాటివాడు? నీవు నరపుత్రుని దర్శించుటకు వాడే పాటి వాడు?" (కీర్తన 8:3-4).

మానవుడే పాటివాడో అనే ప్రశ్నకు జావాబు కొరకై తత్వవేత్తలు ప్రపంచ మంతటా వెదకుచున్నారు. పరిణామ శాస్త్ర వేత్తలు మానవుడు ఒక జంతువు మాత్రమే - కోతి నుండి పరిణామము చెంది యుండ వచ్చునని అనుచున్నారు. కొంత మంది తత్వవేత్తలు మానవుని ఒక మేధా విగా పరిగణిస్తున్నారు. గ్రీకు తత్వ వేత్త అయిన ప్లేటో మానవుడు రెక్కలు లేని ద్విపాద జంతువు అని నిర్ణయించాడు. అయితే కీర్తనకారుని యొక్క ప్రశ్నకు ఇది జవాబు కాదు.

దేవుడు మానవుని జ్ఞాపకము చేసి కొనుటకు మానవునిలోని ప్రత్యేకత ఏమిటి? దేవుని ప్రక్కకు పెడితే మానవుడే పాటివాడు అను ప్రశ్నకు జవాబు లేదు. పరిణామ వేత్త చెప్పినది సరియైనదైతే మానవుడు జంతువు మాత్రమే అట్లయిన ఒక జంతువు మరొక జంతువును భక్షించే జీవన విధానము ఎందుకు లేదు? తత్వవేత్త చెప్పినట్లు మానవుడు యుగాలలో మేధావి అయినపుడు ఉన్నతమైన శక్తిని సంప్రదించుటకు ప్రయాస పడనవసరము లేదు కాని సమాజము చెడి పోయి యున్నది. "అయితే దుర్జనులును వంచకులును ఇతరులను మోసపరచుచు తామును మోసపోవుచు అంతకంతకు చెడిపోవుదురు" (2 తిమో 3:13). అయితే దేవుడు మానవుని పై విధముగా చిత్రీకరించ లేదు.

దేవుడు మానవుని జ్ఞాపకము చేసి కొనుచున్నాడని లేఖనము చెప్పుచున్నది. ఎందుచేత? మానవుని జ్ఞాపకము చేసి కొనుటలో మానవునిలో దేవుడు గమనించినది ఏమిటి? మానవుని గూర్చిన ఆయన

ఉద్దేశము ఆయన వాక్యమునందు మనకు లభించును.

### 1. మానవుడు ఈ రీతిగా ఉండెను: (Man as He was)

మనము మానవుని గూర్చి తెలిసి కొనవలెనంటే, మనము అతని తయారు చేసిన వ్యక్తిని సంప్రదించవలెను. "ఆది యందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను...... దేవుడు ...... మన స్వరూప మందు మనపోలిక చొప్పున నరులను చేయుదము....... దేవుడు తన స్వరూప మందు నరుని సృజించెను. దేవుని స్వరూప మందు వాని సృజించెను. స్త్రీని గాను పురుషుని గాను వారిని సృజించెను" (ఆది 1:1, 26-27).

ప్రపంచములను సృజించిన దేవుడు మానవుని కూడా సృజించెను. మరియు పౌలు ఈలాగు చెప్పెను. "మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన ఒకని నుండి ప్రతి జాతికి మనుష్యులను సృజించి వారు ఒకవేళ దేవుని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయకాలమును వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమా యనయందు బ్రతుకుచున్నాము. చలించు చున్నాము. ఉనికి కలిగి యున్నాము. అటువలె మనమాయన సంతానమని మీకవీశ్వరులలో కొందరు చెప్పు చున్నారు" (అపొ. 17:26-28). దేవుడే మానవునికి మూలాధారము. మనము ఆయన సంతానము అందుచేత దేవుడు మానవుని జ్ఞాపకము చేసికొనుచున్నారు.

దేవుడు మానవుని ఆయన స్వరూప మందు సృజించినపుడు మానవుడు పరిపూర్ణుడుగా యున్నాడు. "నీవు నియమింపబడిన దినము మొదలుకొని పాపము నీయందు కనబడు వరకు ప్రవర్తన విషయములో నీవు యదార్ధముగా ఉంటివి" (యెహె 28:15).

మానవుడు దేవుని యొక్క స్వరూప మందు సృజింపబడెను.... ఆయన యొక్క తెలివి, వివేకము, భావము, సంకల్ప శక్తి మానవుడు కల్గియుండెను. దేవుని యొక్క సృష్టి యంతటిలో మానవుడు మాత్రమే ఆయన చిత్తమునకు విధేయత చూపుట ద్వారా దేవుని మహిమ పర్చగలడు. జంతువులు బాహ్యప్రేరణల కనుగుణముగా అవి వాటి కోరికలనను సరించి ప్రతిచర్య చూప గలవు. కాని దేవుని యొక్క ఉద్దేశమును నెరవేర్చుటలో తనకు అసౌకర్యముగా ఉన్నప్పటికి మానవుడు తన కోరికలను అదుపులో ఉంచుకొనగల శక్తి మానవునిలో గలదు. మానవునిలో మాత్రమే దేవుని యొక్క వివేకము, భావ వ్యక్తీకరణ గలవు. ఒక అందమైన సముద్రప్రాంతాన్ని లేక పర్వత ప్రాంత దృశ్యాన్ని ఎంతచురుకైన జంతువైన ఎక్కువ సేపు గుర్తుంచుకోలేదు. కాని మానవుడు ఆదృశ్యాలను తన మనస్సులో గంటలకొలది గుర్తుంచుకొ గలడు తిరిగి

వాటిని చిత్రాలుగా చిత్రించి కొన్ని సంవత్స రాలుగా ఆ అందాలను ప్రతిబింబింప చేయగలడు.

మానవుడు దేవుని సారూప్యమందు పరిపూర్ణుడుగా సృష్టించబడెను. దేవునికి విధేయత గల వ్యక్తిగా, దేవుని చిత్తాన్ని నెరవేర్చుచు దేవుని ఎడల ప్రేమతో విధేయత చూపుట ద్వారా దేవుని మహిమ పరచే వ్యక్తిగా మానవుడు సృజింపబడెను. "ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్ధమిదే దేవుని యందు భయ భక్తులు కలిగి యుండి ఆయన కట్టడలన నుసరించి నడచుకొనవలెను. మానవ కోటికిఇదియే విధి. (ప్రసంగి 12:13). కాని ఈ విధానము మారిపోయినది.

## 2. మానవుడు ఈ రీతిగా ఉన్నాడు: (Man as he is)

దేవుడు మానవుని తన స్వరూప మందు సృజించి ఏదెను తోటలో అతని ఉంచెను. ఆయన మానవునికి ఒక పని కల్పించెను. అతని జీవితానికి ఒక ఉద్దేశము కలదు. "ఏదెను తోటలో సేద్య పరచుటకు దానిని కాచుటకు దానిలో ఉంచెను" (ఆది 2:15). దేవుడు ఆదాముతో ఈలాగు చెప్పెను. ఈ తోటలో నున్న ప్రతి వృక్ష ఫలములు నీవు నిరభ్యంతరముగా తిన వచ్చును. అయితే మంచి చెడ్డల తెలివి నిచ్చు వృక్షఫలములను తినకూడదు. నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను" (ఆది 2:16-17). ఆ తోటలో ఎన్నిరకాల వృక్షము లున్నవోనాకు తెలియదుగాని సాతాను ఆ పండును మాత్రమే తినమని ప్రభోధించుట వలన వారు దానిని తిని పాపముచేసిరి. ఎప్పు డైతే ఆ పండును తిన్నాడో మానవుడు ఇప్పు డున్న విధముగా మారిపోయాడు.... దేవుని పై తిరుగుబాటు చేసి, ఆయన చిత్తాన్ని అతి క్రమించి సాతానుకు బానిసయై నరకాన్కి పాత్రుడయ్యాడు.

ఆ తిరుగుబాటు స్వభావము ఆదాము హవ్వ నుండి వారి పిల్లలకు వారి నుండి మనకు ప్రాప్తించెను. "మనమందరము గొర్రె లవలె తోవ తప్పిపోతిమి. మనలో ప్రతీవాడు ను తన కిష్టమై న త్రోవకు తొలిగెను" (యెషయా 53:6). "నీతి మంతుడులేడు ఒక్కడును లేడు....(రోమా 3:11). ఏ భేదమును లేదు అందరును పాపము చేసి దేవుడు అను గ్రహించు మహిమను పొంద లేక పోవుచున్నారు" (రోమా 3:23). మానవుని చరిత్ర ఈ విధముగా ఉన్నది... ఆదాము పాపమును ఈలోకము లోనికి తెచ్చెను. కయీను మొదటి హంతకుడు. నోవహు కాలములో నరుల చెడుతనము భూమిపై గొప్పది వారి హృదయము యొక్క తలంపులోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డది (ఆది 6:5). స్వార్ధము, అబద్ధము, వ్యభిచారము, దొంగతనము, హత్య ఒకరినొకరు చంపు కొని తిను స్వభావము ఈనాటి సమాజము లోనికి వచ్చినది. "మనము పాపము లేని

వారమని చెప్పుకొనిన ఎడల మనలను మనమే మోసపుచ్చుకొందుము. మనలో సత్యముండదు. (1 యోహాను 1:8). మానవుడు ఈ రీతిగా ఉన్నాడు.

ఈ రీతిగానున్న మానవుడు తన క్రియలన్నిటికి జవాబుదారిగా ఉన్నాడు. అందునుబట్టి అతడు శిక్షార్హుడు. పాపము చేయువాడే మరణము నొందును (యెహె 18:20). "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). దురాశ గర్భము ధరించి పాపమును కనగా పాపము పరిపక్వమై మరణమును కనును (యాకోబు 1:15). పావమునకు శిక్ష ఉండక మానదు. పాపము వలన ఆదాము ఏదెను వనము నుండి బయటకు పంపి వేయబడ్డాడు. నోవహు కాలము నాటి దుష్ట జనాంగము జల ప్రళయములో నాశనమై పోయారు. తిరుగు బాటు చేసిన ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమియైన కనానులో ప్రవేశించ లేదు.

ఈ విధముగా మానవుని యొక్క నైజమును దేవుడు మనకు చూపి యున్నాడు. ఈలాగున్న మానవుడు దేవుని యొక్క ప్రేమకు, కృపకు మరియు దయకు పాత్రుడై నాడు. "దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3:16)" ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్త కాలమున భక్తి హీనులకొరకు చనిపోయెను. నీతి మంతుని కొరకు సహితము ఒకడు చని పోవుట అరుదు; మంచివాని కొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింప వచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచు చున్నాడు; ఎట్లనగా మనమిం కను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను (రోమా 5:6-8). దేవుడు తన అద్వితీయ కుమారుని మానువుని కొరకు చనిపోవుటకు ఎందుకు పంపెను? మానవుని జ్ఞాపకము చేసికొనుటకు మానవు నిలోని ప్రత్యేకత ఏమిటి?

మానవుడు పూర్వమేలాగుండెనో దేవుని కి తెలుసు. క్రీస్తు ద్వారా మానవుడు తన పూర్వపు స్థితిని పొందగలడని దేవునికి తెలియును.

### 3. మానవుడు ఈ రీతిగా ఉండగలడు:

( Man as he can be)

క్రీస్తు సిలువపై బలియాగమగుట వలన మానవుని యొక్క మరియొక రూపము ఉత్పన్నమయ్యెను. "మీరు మన ప్రభువైన ఏసుక్రీస్తు కృపను మీరెరుగుదురు కదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను (11 కొరి 8:9). దేవుడు మానవుని పాపి అని ప్రేమించుటలేదు

గాని మానవుడు ఇంతకు మునుపున్నా స్థితికంటే ఇంకా మంచిస్థితిలోనికి మార్పు చెందగల డని దేవుడు మానవుని ప్రేమిస్తున్నాడు. అందుకొరకే క్రీస్తు చనిపోయెను. "జీవించు వారికమీదట తమకొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవాని కొరకే జీవించుటకు ఆయన అందరి కొరకు మృతిపొందవలెనని నిశ్చయించుకొనుచున్నాము. (11 కొరింధి 5:15). మానవుడు పాపము ద్వారా పోగొట్టుకొనిన స్థితిని. క్రీస్తు ద్వారా తిరిగి పొందెను. దేవుని సారూప్యములో ఉన్నా మానవుడు పాపము వలన దేవుని నుండి వేరుచేయుబడెను. కాని క్రీస్తునందు క్షమాపణ పొందగలడు. మరియు "జ్ఞానము కలుగు నిమిత్తము దాని సృష్టించిన వాని పోలిక చొప్పున నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించు కొని యున్నారు (కొలస్సీ 3:10). ఏదెను తోటలో కోల్పోయిన దానిని మానవుడు కల్వరిలో తిరిగి పొందగలడు. "మనమందరమును ముసుగు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతి ఫలింప జేయుచు మహిమ నుండి అధిక మహిమను పొందుచు ప్రభువగు ఆత్మ చేత? ఆ పోలిక గానే మార్చబడుచున్నాము." (11 కొరింధి 3:18).

క్రీస్తునందు మానవుడు పాపము నుండి విడుదల పొందగలడు. పాపము మానవుని దేవుని నుండి వేరుపరచెను. (యెష 59:1-2). మానవుడు పాపము నుండి విడుదల పొందగలడని దేవుడు గమనించి మానవుని జ్ఞాపకము చేసుకొంటున్నాడు. యేసు ఈలాగు చెప్పెను "మనుష్య కుమారుడు నశించిన దానిని వెదకి రక్షిం చుటకు వచ్చెను....." ఆయన యందు విశ్వాసముంచి బాప్తిస్మము పొందిన వాడు రక్షించబడును" (లూకా 19:10; మార్కు 16:16).

క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతి బెట్టబడితిమి మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై, పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి (రోమా 6:3;-4;17-18).

మానవుడు ఈ రీతిగా ఉండగలడు. దేవునికి విధేయుడైన బిడ్డగా మానవుడు తనలో గల జంతు స్వభావమును అనగా ఒకరినొకరు చంపుకొనే స్వభావమును అధిగమించి జీవించవలెను. మానవుని ప్రస్తుత స్థితి దేవునిపై తిరుగు బాటు చేసిన స్థితి. కాని దేవునికి విధేయుడుగా ఉంటూ

తన తోటివారిని ప్రేమించే స్థితి మానవుడు ఉండగల స్థితి. క్రీస్తు తనకు విధేయులగు వారికందరికి నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:9). దేవుడు మానవుని తన పోలికలో చేయుటలో గల ఉద్దేశమేమనగా ఆయన యందు విశ్వాసము ద్వారా విధేయులగుటకు ఆయనకు మహిమ తెచ్చుటకు (రోమా 1:5 మరియు 16:26). అపొ॥ పౌలు ఈలాగు చెప్పెను. యేసు క్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు. (గలతీ 3:26, 27). మనము క్రీస్తును ధరించుకొన్నపుడు ఆయన ప్రేమ, ఆయన దేవునికి చూపిన విధేయతను మనముకూడా మన జీవితములో కల్గియుండాలి.

**4. మానవుడు ఈ రీతిగా ఉండవలెను:**

(Man as he shall be)

మానవుడు ఈ రీతిగా ఉండవలెనని లేఖనము బయలుపరచుచున్నవి. మానవునికి ఎంచుకొనే శక్తి (Will power) ఉన్నది గనుక వాని క్రియలను బట్టి అతనికి తీర్పు తీర్చబడును. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును (హెబ్రీ 9:27). మనుష్యుడు ఈ రీతిగా ఉండవలెను. జంతువు తీర్పును గూర్చి ఏమి చెప్పబడలేదుగాని, మానవునికి మాత్రమే తీర్పు తీర్చబడును. పరిణామ శాస్త్రవేత్త చెప్పినట్లు మానవుడు జంతువు కాదు మరియు తాను ఏలాగు జీవించుచున్నాడో తాను ఏమి చేయుచున్నాడో దానికి లెక్క అప్పగింపవలెను. "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైననుసరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును". (11 కొరింధి 5:10).

మానవుడు ఈ రీతిగా ఉండుటకుగాను రెండు గమ్యములున్నవి. మానవుడు ఏదో ఒక దానిని ఎంచుకొనవలెను. నీ కొరకు ఎవరు ఎంపిక చేయరు. లేక ఎవరికి నీవు ఎంపిక చేయవు. కనుక ప్రతివాడు తనను గూర్చి తాను దేవునికి లెక్క అప్పగింపవలెను (రోమా 14:12). ప్రతివాడు ఒంటరిగా తీర్పు ఎదుట నిలువ బడవలెను. కాని క్రీస్తులో ఉన్నవారికి క్రీస్తు ఉత్తరవాదిగా ఉన్నాడు (1 యోహాను 2:12). భళా నమ్మకమైన మంచిదాసుడా అని అనిపించుకొందువా లేక నన్ను విడిచి నిత్యాగ్నిలోనికి పోవుడి అని అనిపించు కొందువా? (మత్త 25:31-46) అనునది ఈ లోకములో ఇపుడు మనము జీవించుచున్న జీవితముపై ఆధారపడి యుం డును.

దేవుడు మానవుని జ్ఞాపకము చేసికొనుటకు మానవునిలో ఏదో ఉన్నది అదే మానవుని జంతువునుండి వేరు చేయుచున్నది. సర్వసృష్టికర్తయైన నిత్యుడగు దేవునికి మానవుడు చాలా విలువైన వాడు. అందుచేతనే తన ఏకైక కుమారుని మానవుని

కొరకు చనిపోవుటకు పంపెను. మరొక విధముగా చెప్పాలంటే మానవుని యొక్క మొదటి స్థితి దేవునికి చాలా విలువైనది. కనుక మానవుడు ఆపూర్వ స్థితి పొందాలి. అందుచేతనే దేవుడు ఈరోజు మానవుని జ్ఞాపకము చేసి కొనుచున్నాడు. మానవుడు దేవునికి చాలా విలువైనవాడు.

ప్రియ చదువరీ! నీవు దేవుని ఎడల తిరుగుబాటు చేస్తూ దేవుని కొరకు గాక నీ కొరకు నీవే జీవించు ప్రస్తుత స్థితిలో ఉన్నట్లయితే దేవుడు తన కుమారుని నీ కొరకు సిలువలో మరణింప జేయుట ద్వారా నీవు పూర్వపుస్థితిని పొందాలని దేవుడు ఆశించుచున్నారు. దేవుని యొక్క ఆ సందేశమును విని దేవుని కొరకు నమ్మకమై క్రైస్తవునిగా ప్రతిరోజు నివసించ గల మనిషిగా మార్పు చెందగలవా?

దేవుని న్యాయపీఠము ఎదుట నిలువబడి నిత్యజీవితమును ఎక్కడ గడపాలని నిర్ణయించబడుతుందో ఆచోటికి చేరేందు సిద్ధముగా ఉంటే మానవునిగా ఉన్నావని జ్ఞాపకముంచుకో. పూర్వము ఇశ్రాయేలీయులకు ఇచ్చిన విధముగానే నీకు కూడా ఎంపిక చేసికొనే శక్తినిచ్చాడు. "నేడు జీవమును, మరణమును, ఆశీర్వాదమును, శాపమును నేను నీ ఎదుట ఉంచి, భూమ్యాకాశములను మీ మీద సాక్షులుగా పిలుచుచున్నాను. నీ పితరులైన అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ఆయన ప్రామణము చేసిన దేశములో మీరు నివాసించునట్లు యెహోవాయే నీ ప్రాణమునకును నీ దీర్ఘాయుస్సుకును మూలమై యున్నాడు. కాబట్టి నీవును నీ సంతానమును బ్రతుకుచు నీ ప్రాణమునకు మూలమైన నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్య మును విని ఆయనను హత్తుకొను నట్లు జీవమును కోరుకొనుడి" (ద్వితీ 30:19-20).

అనువాదం - బి.ఎస్.ఎ. సువార్త

సత్యవాణి రేడియో కార్యక్రమాలను ఆది, సోమ, బుధ, వారల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. మీ బంధు మిత్రులకు విన్పించండి !!

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 30/- లు- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

## క్రీస్తు సంఘముల Voice of Truth T.V. కార్యక్రమాలు

**Hindi** : సత్య సు సమాచార్

ప్రతి ఆదివారం : ఉదయం 6:00 నుండి 6:30 వరకు
ETC Channel
Speaker : సన్నీ డేవిడ్.

**Telugu** : సత్యవాణి

ప్రతి గురువారం : కాకినాడలో మాత్రమే
ఉదయం 7:00 నుండి 7:30 వరకు
సాయంత్రం 5:30 నుండి 6:00 వరకు
Siti Text Channel & In cable లో

ప్రతి శనివారం : ఉదయం 6:30 నుండి 7:00 వరకు
Teja Channel లో
Speaker : జాషువా గూటం.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.

is good singing team also. We are remembering you all in our daily prayers. Please also remember us in your prayers.

**- Ravindra Kl. Guntur.**

Dear beloved brother Ricky Gootam, Greetings in the name of our Lord Jesus Christ. I am so very happy for your great messages. I like young preahers.

**- V. David Raju, Kanigiri, Prakasam Dt.**

Dear Bro. Joshua we are very much impressed by your programes on Teja T.V. every Saturday. Recently your son John Ricky is also giving good sermons. We pray that your ministry be blessed by our Lord Jesus Christ.

**- P.M.D. Krupavaram, Guntur.**

ప్రభువైన యేసు క్రీస్తులో మీకు వందనములు చెల్లిస్తున్నాను. మీ టి.వి. కార్యక్రమాలు తప్పకుండా చూచి ప్రభువునందు ఆనందిస్తున్నాము. పాటలు, వాక్యం ఎంతో ప్రభువును తెలిసికొనుటకు మాకు ప్రోత్సహమిస్తున్నాయి. 15న రిక్కి గారి ప్రభువు యొక్క జననం, ఆయనకున్న శక్తి, దేవుని నామములు (ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయకు అధిపతియైన దేవుడు) వాక్యం మమ్మల్ని ఎంతగానో ప్రభావితం చేసింది. వందనములు.

*- ఎమ్. ఆశీర్వాదం, కృష్ణాజిల్లా.*

" అయ్యా టి.వి.లో మీరు ప్రసారం చేస్తున్న సత్యవాణి కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా చూస్తున్నాము. కొందరు వాక్యం చెప్తె కొందరికే అర్ధమవుతుంది కాని మీరు వాక్యం చెప్తె అందరికి, చదువు లేని వారికి పల్లెటూరివాళ్లకి, సీటిలో ఉన్నవారికి అందరికి బాగా అర్ధమవుతుంది. మీరు చెప్పిన మాటలు, రిఫరెన్సులు మా సంఘంలో చెప్పుకోవడానికి ఈజీగా ఉపయోగపడుతున్నాయి.

*టి. సత్యనారాయణ, విజయనగరం జిల్లా.*

"క్రిందట శనివారం టి.వి. ద్వారా కమ్మని ప్రభువు చరిత్ర పూర్తిగా యువకుల ద్వారా వినిపించబడుచుండగా చూస్తూ, వింటూ - గూటం కనుపించుటలో ఉప్పొంగిపోయింది నా హృదయం. వారు జాషువా గూటం గారి తనయులా, లేక ఆ కుటుంబ సభ్యులా అని ఆలోచిస్తూ సంతసించాను. వృద్ధాప్యంలో నున్న నా కొరకు ప్రభువు ప్రార్ధించగలరని మిమ్ము అందరనీ కోరుకొంటున్నాను".

*- కె.డి.ఎస్. రావ్, తెనాలి.*